

బి.వి.యస్. నగేష్
మెజీషియన్ అండ్ హిప్నాటిస్ట్
1–8–430/3,
వెంకటేశ్వరస్వామి గుడివద్ద,
చిక్కడపల్లి, హైదరాబాద్–20

# మీరూ మెజీషియన్లే

## తనకు తానే తిరిగే బంతి

స్టేడియంలో ఎవరి ఇష్టమొచ్చినట్లు వాళ్ళు ఫుట్‌బాల్‌ను తన్నుతుంటే బంతి చేసేదిలేక పరుగులు పెడుతూ వుంటుంది. ఒకళ్ళు తన్నగానే తప్పించుకోడానికా అన్నట్లు ఎటో పరుగులెడుతుంది. అదే దిక్కులో ఇంకొకరు తన్నడానికి తయారుగా వుంటే బంతి తన శరీరాన్ని అప్పగిస్తుంది. ఇలా తన్నించుకుంటూ తన్నిన ఆటగాళ్ళకు మార్కులు సంపాదించి పెడుతుంది. తను కాలిపోతూ వెలుగునిచ్చే క్రొవ్వొత్తి లాంటిది బంతి. కాని ఇలా ఎవరిచేతా తన్నించుకోకుండా తనకిష్టమొచ్చినట్లు తానే పైకి క్రిందికి తిరిగే బంతిని మీరు మేజిక్‌ద్వారా చూడవచ్చు.

అయితే ఈ ట్రిక్కు ఫుట్‌బాల్‌తో చేసేది కాదు. ఒక వెడల్పుమూతి వున్న సీసానుగాని, పొడుగ్గావున్న తొట్టెగాని, గాజు బీకరుగాని తీసుకుని ఈ ట్రిక్కును చెయ్యవచ్చు. ప్రేక్షకులు చూస్తుండగా ఈ బీకరులో ఒక ద్రావణముపోసి ఒకచిన్న బంతిలాంటిది వేస్తే వెంటనే ఆ బంతి ఎవరి సహాయం లేకుండా పైకి క్రిందికి తిరుగుతుంది. ఇది చూడటానికి చాలా ముచ్చటగానూ, ఆశ్చర్యంగానూ వుంటుంది.

ఈ ట్రిక్కు ఏ విధంగా చెయ్యాలి అనే విషయానికి వస్తే, దీనికి రసాయనిక పదార్థాలతో పని వుంది. గాజు బీకరులో వున్నది నీరు కాదు. అది ఒక రసాయినిక ద్రావణము. ప్రేక్షకులకు మాత్రం నీరు అని చెప్పాలి. అలాగే బంతిలాగ కనిపించేది బంతికాదు. పెద్దసైజు కలరావుండ. ఈ ట్రిక్కు వేసే ముందు రసాయినిక ద్రావణాన్ని తయారు చేసుకుని వుంచుకోవాలి. ఈ ద్రావణాన్ని తయారు చేసే విధానం చూద్దాం.

బీకరులో అసిటిక్ ఆమ్లమును వేసి అందులో కొన్ని ముక్కలు సోడియం కార్బనేటు ద్రావణం కలపాలి. ఈ రెండింటి మిశ్రమం వలన ఒక వాయువు ఉత్పత్తి అవుతుంది. ఈ ద్రావణంను సరిగ్గా ట్రిక్కు చేసేముందు కలిపి వెంటనే కలరావుండను అందులో వేసి ట్రిక్కు మొదలుపెట్టాలి. ఈ వాయువువల్ల ద్రావణంలో గాలి బుడగలు తయారవుతాయి.

ఈ గాలి బుడగలు కలరావుండ చుట్టూ చేరుతాయి. ఈ విధంగా గాలిబుడగలుతో వున్న కలరా వుండ ద్రావణం మట్టవైపుకు అంటే బీకరు పైభాగం వైపు బయలుదేరుతుంది. మట్టం చేరగానే గాలిబుడగలు పగిలిపోతాయి. వెంటనే కలరావుండ బరువుకు క్రిందికి దిగిపోతుంది. మళ్ళీ కథ మామూలే. మళ్ళీ కలరావుండ చుట్టూ బుడగలు బయలుదేరుతాయి. కలరావుండ పైకి బయలు దేరుతుంది. బుడగలు పగిలిపోగానే మళ్ళీ క్రిందికి వస్తుంది. ఈ విధంగా తనకు తానే కలరావుండ తిరుగుతుంది.

ఈ మొత్తం కార్యక్రమాన్ని ఆకట్టుకునేలా చెయ్యాలంటే మీ చేతిలో ఒక కర్రి పట్టుకుని, అది మీ మేజిక్ దండం అని చెప్పి, కలరావుండ ఎటు వెళ్తుంటే అటు కర్రను తిప్పండి. నిజంగా మేజిక్ ఆకట్టుకుంటుంది. దీనికి తోడు మంచి కథ అల్లితే ఇంకా బాగుంటుంది. మూఢనమ్మకాలు పెంచేది కాదు సుమా!

# ''క్లూ''

పడక కుర్చీలో పడుకుని ఆలోచిస్తూండిపోయారు పరంధామయ్యగారు. వచ్చిన యువకులంతా చిన్నమ్మాయినే ఇష్టపడుతుండటంతో, దిగులుతో ఆయన మనసంతా భారమైంది. ''తన తల్లికేం తక్కువ, ఇద్దరూ ఆణిముత్యాలాంటి వాళ్ళు, పెద్దమ్మాయి 'సుజాత'. చిన్నది 'అనూష' కంటే కాస్త రంగు తక్కువ. అనూషను, ఎవరైనా కళ్ళు మూసుకుని చేసుకుంటారు. పెద్దమ్మాయిదే సమస్య.

''నాన్నగారూ! ఈ చిక్కుప్రశ్నకు జవాబు చెప్పరూ?'' అంటూ వచ్చాడు పదేళ్ళ రవి.

''అబ్బబ్బ! కాస్త ప్రశాంతంగా ఉండనివ్వరా!'' విసుక్కున్నాడాయన. కోపంగా

''అక్కా! అక్కా! నువ్వయినా చెప్పవే'' అంటూ పెద్దక్క సుజాత దగ్గరకు వెళ్ళాడు రవి.

''ఏం లెక్కరా?'' అడిగింది సుజాత.

''మరేమో, ఈ నోట్‌బుక్ పేపర్‌పై ఓ గీతగీశాడు, దాన్ని చెరపకుండానే చిన్నది చేసుకురమ్మన్నారు మా మాష్టారు.''

''ఓస్! దీనికా ఇంత హంగామా!'' అంటూ ఆ నోట్‌బుక్ చేతుల్లోకి తీసుకొని, ఆ గీత ప్రక్కన మరో పెద్ద గీత గీచింది.

''భలే! భలే! ఆ గీత ప్రక్కన దానికన్నా పెద్దది గీయగానే మొదటి గీత చిన్నదైపోయింది. అవునా?'' అన్నాడు ఆనందంతో గంతులేస్తూ.

''అంతే కాదు ఆ గీతను ఏమాత్రం పొడిగించకుండానే పెద్దదికూడా చెయ్యొచ్చు'' అంటూ ఒక గీతగీచి, దానిప్రక్కన మొదటిదానికన్నా కొంచెం చిన్న గీత గీచింది.

''హై! భలేగా పెద్దదైపోయిందే. అంటే ఒక గీత ప్రక్కన, దానికంటే చిన్నది గీస్తే మొదటి గీత ఆటోమాటిగ్గా పెద్దదైపోతుంది'' అన్నాడు చప్పట్లుకొడుతూ.

ఇదంతా గమనిస్తున్న పరంధామయ్యగారి మెదడులో ఫ్లాష్ వెలిగినట్లయి, తన సమస్యకు 'క్లూ' లభించినట్లయింది. ఇంతకాలం వచ్చిన యువకులంతా, పెద్దమ్మాయి ఎందుకు నచ్చటం లేదో తెలిసిపోయింది.

దాంతో, ఆ తర్వాత పెళ్ళిచూపుల్లో ఇదివరటిలా చిన్నమ్మాయి 'అనూష'తోగాక, సుజాతకంటే కొంచెం అందం తక్కువైన, ఆమె స్నేహితురాలు 'రమ'తో మర్యాదలవీ చేయించటం, ఆ వచ్చిన యువకుడికి సుజాత నచ్చటం, నెల రోజుల్లో పెళ్ళి కూడా అయిపోవడం జరిగింది.

ఎ.ఎస్.ఎన్. గుప్త